క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు



కోడూరు: కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. అవనిగడ్డ నుంచి కోడూరు వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను సిబ్బంది తొలగించారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు చేశారు. లైన్ ఐసోలేటర్లు, టెర్మినల్ గ్రాంటీ, ఎల్‌ఏలను పరిశీలించి, వాటికి అవసరమైన మరమ్మతులను సిబ్బంది నిర్వహించారు. ఇన్‌చార్జి ఏఈ గోపిచంద్, లైన్‌మెన్లు పర్యవేక్షించారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లికి విరాళం

చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి విశ్రాంతి ఉపాధ్యాయుడు పాతూరి ఉదయ శంకరశాస్త్రి రూ.5 వేలు విరాళం అందజేశారు. చల్లపల్లి ప్రధాన కూడలిలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛసుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ పద్మావతికి పాతూరి ఈ విరాళం అందజేశారు. కార్యక్రమంలో పలువురు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేడీసీసీబీ డైరెక్టర్ పదవికి రాజీనామా



మోటేపల్లి రత్నారావు

గూడూరు: కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మోటేపల్లి తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తీవ్ర నిరాశ కలిగించాయన్నారు. తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్ సీపీ, మంత్రి జోగి రమేష్ ఇచ్చిన పదవులకు న్యాయం చేశానని రత్నారావు తెలిపారు. గత 20 ఏళ్లుగా మండలంలో విస్తృతంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చానన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ మండల ప్రజలకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలలో చురుకుగా పాల్గొనడం వల్ల కుటుంబానికి, బంధువులకు దూరమయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి సమయం కేటాయిస్తానని ఆయన అన్నారు.

త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని మంగళాపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి పేరం నాగిరెడ్డి రాజీనామా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వారిని ఏర్పాటు చేయగా ప్రభుత్వం మారడంతో రాజీనామా చేసినట్లు నాగిరెడ్డి చెప్పారు. ఆయనతో పాటు చైర్‌పర్సన్స్ కొర్రపాటి ముఖర్జి, కాళింగా ఆదిలక్ష్మి తమ పదవులకు రాజీనామా చేశారు. పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేసినందుకు వారిని తొలుత సొసైటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. పీఏసీఎస్ సీఈవో చంద్ర రవి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Rateesh Dadi** (old Name) Resident of Door No. 11-2, Nagayalanka Village, Nagayalanka Mandal, Krishna District, A.P., I have changed my name as **DADI RATEESH** (New Name), S/o. Madhusudhana Rao, hereafter my name is known as **DADI RATEESH** (New Name) S/o. Madhusudhana Rao.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బజారు బ్రాంచ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా

APPENDIX-IV **స్వాధీనత ప్రకటన** (రూల్-8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 సంబంధి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ ఊటుకూరి శాంతిరాజు,** తండ్రి : నాంచారయ్య, డోర్ నెం. 15-207-172, ఎమ్‌ఐజి.II -172, న్యూ ఏపిహెచ్‌బి కాలనీ, మచిలీపట్నం - 521002 & **శ్రీమతి ఊటుకూరి శ్రీ రాధిక (హోమ్ టాప్‌అప్ లోన్ ఋణగ్రహీత),** భర్త : శాంతిరాజు, డోర్ నెం.15-207-172, ఎమ్‌ఐజి.II-172, న్యూ ఏపిహెచ్‌బి కాలనీ, మచిలీపట్నం - 521002 (**హోమ్‌లోన్ అకౌంట్ నెం. 36314538038, హోమ్ టాప్ అప్ లోన్ అకౌంట్ నెం. 36368778317**) వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 36,50,361/-** (అక్షరాల ముప్పై ఆరు లక్షల యాభై వేల మూడు వందల అరవై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు **తేది.27-02-2024** వరకు వడ్డీతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **27-02-2024**న డిమాండ్ నోటీసు జారీ చేయుటడినది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 సంబంధి సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన రూలు 8 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 03-06-2024**న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకొనుటకు శ్రద్ధ వహించవలెను.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 36,50,361/-** మరియు **తేది. 28.02.2024** నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా** వారి ఛార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలు/ హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఏమైనా చెల్లింపులు ఉన్న యెడల తీసివేయబడును.

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా, మచిలీపట్నం, న్యూ ఏపిహెచ్‌బి కాలనీ వద్ద ఆర్.ఎస్.నెం.లు 173/2P, 173/3, 174/2, 174/3, 175/2P, 176/2, 176/4, 179/1 & 179/2 లోని 266.66 చ॥గ॥లు లేదా 222.927 చ॥మీ॥ల స్థల విస్తీర్ణంలో నిర్మించిన డోర్ నెం. 15-207-172, ఇంటి నెం. 172తో గల భవనము యొక్క ఆస్తి కృష్ణాజిల్లా, మచిలీపట్నం ఎస్ఆర్ఓ వద్ద తేది. 03.12.2014న రిజిష్టరు కాబడిన రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం. 8556/2014 ప్రకారం శ్రీ ఊటుకూరి శాంతి రాజు, తండ్రి : నాంచారయ్య గారికి చెందినది. **హద్దులు : ఉత్తరం:** ఎమ్‌ఐజి-II- ఇంటి నెం.174, **దక్షిణం :** 40 అడుగుల వెడల్పు రోడ్డు, **తూర్పు :** ఎమ్‌ఐజి-II- ఇంటి నెం.173, **పడమర :** ఎమ్‌ఐజి-II- ఇంటి నెం.171.

తేది : 03-06-2024
ప్రదేశం : మచిలీపట్నం

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె..!



ముస్తాబైన కల్యాణ వెంకటేశ్వరుడి ఆలయం

- ఈ నెల 17 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ముస్తాబవుతున్న శ్రీవారి ఆలయం

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 17న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించి, సాయంత్రం 5గంటలకు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. అదే రోజు రాత్రికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదమును అందించనున్నట్లు తెలిపారు. 18న ఉదయం హోమాలు, శతకలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురుకోలోత్సవం, 19న ఉదయం కౌతుకోత్సవం, నవ కలశస్నపన, రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, 21న అవభృదస్నానం, మహాపూర్ణాహుతి,ధ్వజారోహణ, 22న శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ తెలిపారు. 23న శ్రీవారి మహా అన్నసమారాధనను నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు. శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరుడు

ప్రసన్నాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మూడు వేలమందికి అన్నదానం

కోడూరు: హనుమాన్ జయంతి సందర్భంగా లింగారెడ్డిపాలెంలో వినాయక ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గారెల దండలు, తులసీ మాలలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కోడూరు, నక్కవానిదారి, మందపాకల, లింగారెడ్డిపాలెం, జరుగువానిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు ఈ అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన భక్త బృందాల సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అన్నసమారాధనలో భక్తులు

శ్మశానవాటికలో దహన సంస్కార స్టాండ్ చోరీ

ఘంటసాల: ఘంటసాల హిందూ శ్మశాన వాటికలో కిల్న్ (శవ దహనం చేసే బీడు మెటీరియల్ స్టాండ్)ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు శ్మశాన సంరక్షకులు గొరుముచ్చు నాంచారయ్య (దత్తు), కంచర్ల రామారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజులాగానే శ్మశాన వాటిక ప్రాంగణంలోని సరోజని పార్కులో విధులు నిర్వహించడానికి వెళ్లామని, సమీపంలోని దహన మందిరాన్ని పరిశీలించడానికి వెళ్లగా శవ దహనం చేసే స్టాండ్ ధ్వంసం చేసినట్లు ఉందన్నారు. దగ్గరకు వెళ్లి చూడగా స్టాండ్‌లు (కిల్న్) 9 ఉండాల్సి ఉండగా 5 కిల్న్‌లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించామన్నారు. సుమారు 13 ఏళ్లుగా వినియోగిస్తున్న ఈ కిల్న్‌లు అపహరణకు గురవడం బాధాకరమని వాపోతున్నారు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని వారు తెలిపారు. పోలీసులు శ్మశానవాటికను పరిశీలించారు.



ఎమ్మెల్యేకు యూటీఎఫ్ నేతల అభినందన

అవనిగడ్డ: నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావుతో పాటు పలువురు నాయకులు అభినందించారు. ఆయన స్వగృహం వద్ద శనివారం బుద్ధప్రసాద్‌ని కలుసుకున్న యూటీఎఫ్ నాయకులు ఆయనకు పూలమాలవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనకారావు మాట్లాడుతూ జీవో నంబర్ 117ని, సీపీఎస్‌ని రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, పీఆర్‌సీ, డీఏ ఏరియర్స్ బకాయిలు వచ్చేలా చూడాలని బుద్ధప్రసాద్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌ను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

దివిసీమ అభివృద్ధికి వీర రాఘవయ్య కృషి

శ్రీకాకుళం(ఘంటసాల): దివిసీమ అభివృద్ధిలో శీలం వీర రాఘవయ్య భాగస్వామ్యం మరువలేనిదని అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం పంచాయతీ శివారు శీలంవారిపాలెంలో శీలం వీర రాఘవయ్య 102వ జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరరాఘవయ్య విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీర రాఘవయ్య పులిగడ్డ ఆక్విడెక్ట్, కరకట్ట, ఔట్ ఫాల్ స్లూయిజుల నిర్మాణం సమర్థవంతంగా చేశారన్నారు. కార్యక్రమంలో వీర రాఘవయ్య కుమారులు శీలం దివాకరరావు, శీలం రాధాకృష్ణమూర్తి, నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్, కుటుంబ సభ్యులు, శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం కూలమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్‌మెరిట్‌స్కీమ్‌కు ఎంపికైనట్లు ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. చోరంపూడి పాఠశాలకు చెందిన 10 మంది అత్యధికంగా ఈ స్కాలర్ షిప్‌కు ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. పెదతుమ్మిడి జెడ్పీహెచ్ఎస్, చిన తుమ్మిడి ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారన్నారు. జిల్లాలో అత్యధిక మంది విద్యార్థులు ఎంపికై న పాఠశాలగా చోరంపూడి జెడ్పీహెచ్ఎస్ గుర్తింపు పొందిందన్నారు. అందుకు కృషి చేసిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఎంఈవోలు బాలాత్రిపుర సుందరి, వెంకటేశ్వరరావులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



బోడగుంట(మోపిదేవి): ఇటీవల మోపిదేవి శివారు బోడగుంట గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బందెల ఏసురత్నం కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్‌బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, స్టీల్ సామానులు అందజేశారు. సొసైటీ వైస్ చైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, కందుల సీతారామయ్య, వీఆర్వోలు గౌరు వెంకట రమణ, మోపిదేవి శ్రీనివాసరావు, సీహెచ్ మూర్తి, వీఆర్ఏ మురళి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు శివారు ప్రశాంతి నగర్‌కు చెందిన కాకర్లమూడి రాజేష్ రెండు కిడ్నీలు దెబ్బతిని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న కృష్ణా జిల్లా మాల మహానాడు అధ్యక్షుడే దోవా గోవర్ధన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొంతు నరేష్, కే సుధాకర్, కే బాబూజి, ఎం.భాను, టీ రాజేష్, పి.నాగరాజు, కే రాజు తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నేతల నివాళి

అవనిగడ్డ: రామోజీరావు మరణంతో తెలుగుజాతి మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే స్వగృహం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్‌తో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నాగాయలంక: స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నేతృత్వంలో నాగాయలంక ప్రధాన కూడలిలో దివంగతులైన ఈనాడు సంస్థల అధిపతి చెరుకూరి రామోజీరావుకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషాభిమానులు, ప్రజ సంస్థల ప్రతినిధులు, పాత్రికేయుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఐలెండ్ వద్ద శనివారం రాత్రి తొలుత రామోజీరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కొవ్వొత్తులు వెలిగించి చేతబూని జోహార్లర్పించారు. సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్, రంగస్థ కళాకారుడు చన్నగిరి లతామోహన్, పాత్రికేయులు గొరుముచ్చు సూర్యనారాయణ, పూర్ల వేణు, మహిళానేత తలశిల స్వర్ణలత, డీవీకే సత్యప్రసాద్, లకనం నాగాంజనేయులు, దేసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శి మానవతా సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి

బంటుమిల్లి: ఈనాడు సంస్థల అధినేత ప్రముఖ పారిశ్రామిక వేత్త చెరుకూరి రామోజీరావుకు పెడన తాజా ఎమ్మెల్యే నివాళులర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామోజీరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూపీఆర్ విటల్, నాయకులు పాల్గొన్నారు.

హెడ్‌వాటర్ వర్క్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

మచిలీపట్నంటౌన్: నగరంలోని హెడ్ వాటర్‌వర్క్స్‌ను ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర శనివారం పరిశీలించారు. హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి నగర ప్రజలకు తాగునీటిని ఏ విధంగా అందిస్తున్నదీ కమిషనర్ బాపిరాజు, ఏఈ సాయిప్రసాద్‌లను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులు వాడుకలో ఎన్ని ఉన్నదీ, ట్యాంకర్లు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో పంపింగ్ ద్వారా వాటర్ సప్లై జరుగుతోందని దీనిని జోనల్ విధానం ద్వారా పంపిణీ చేస్తే ప్రతిరోజు తాగునీటి సరఫరా చేయవచ్చునని ఏఈ సాయిప్రసాద్ ఎమ్మెల్యే కొల్లుకు వివరించారు. జోనల్ విధానం ఏర్పాటు చేస్తే విద్యుత్ ఖర్చులు తగ్గుతాయి కదా అని ఆయన అన్నారు. క్లోరినేషన్ పూర్తిస్థాయిలో చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. కృష్ణా నదిలో నీటి నిల్వలు లేవని, పులిచింతల డెడ్ స్టోరేజీలోకి వెళ్లిందని వర్షాలు పడితే గాని ప్రాజెక్టులోకి నీరు రావని ఎమ్మెల్యే రవీంద్ర పేర్కొన్నారు. గతంలో మాదిరిగా పట్టిసీమ నుంచి గోదావరి నీళ్లను ఇక్కడకు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్‌జీవన్ పథకం ద్వారా కృష్ణానది నుంచి మచిలీపట్నంకు నేరుగా పైప్‌లైన్ నిర్మించేందుకు కృషి చేస్తామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



హెడ్ వాటర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర

ఇరువురు వర్కర్లకు విద్యుదాఘాతం

కోనేరుసెంటర్: ప్రమాదవశాత్తు ఇద్దరు సీలింగ్ వర్కర్లు విద్యుత్ షాక్ కు గురయ్యారు. ప్రమాదాన్ని పసిగట్టిన స్థానికులు చికిత్స నిమిత్తం ఇరువురిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం సుకర్లాబాదులోని ఓ ప్రైవేట్ బ్యాంకు మూడో అంతస్తులో సీలింగ్ వర్క్ జరుగుతుంది. సదరు పని నిమిత్తం ఎండి ఫరీద్, అబ్దుల్ జబివుల్లా అనే ఇద్దరు శనివారం ఉదయం బ్యాంకు వద్ద చేరుకున్నారు. సీలింగ్ పనికి సంబంధించిన పని ముట్లు మూడో అంతస్తుకు తీసుకు వెళుతుండగా భవనానికి అతి సమీపంలో ఉన్న హై టెన్షన్ వైరు నుంచి ఒక్కసారిగా కరెంట్ షాక్ తగలడంతో ఇరువురు అక్కడికక్కడే కుప్ప కూలిపోయారు. అక్కడే ఉన్న స్థానికులు కొంతమంది 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఇరువురినీ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ఇరువురి పరిస్థితి క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జరిగిన సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే కాగిత పూజలు



కృత్తివెన్ను: పెడన నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్ తొలిసారిగా మండలంలో పర్యటించారు. ముందుగా ఆయన తన భార్య శిరీషాతో కలసి కృత్తివెన్నులో దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, అధికారులు పూర్ణ కుంభంతో ఘనస్వాగతో పలికారు. అనంతరం కృష్ణప్రసాద్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మండల టీడీపీ, జనసేన నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

17 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరురోడ్డు, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, ట్యాలీ కోర్సులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి కోర్సుకు 2 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. అతి తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన విద్యను గత 8 సంవత్సరాలుగా వేలాది మందికి అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, గృహిణులు, జాబ్ చేస్తున్న వారు ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా ఈ కోర్సులు నేర్చుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి కలవారు తమ కార్యాలయంలో లేదా 73821 93413, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పీఏసీఎస్ చైర్మన్ పదవికి రాజీనామా

కృత్తివెన్ను: కృత్తివెన్ను శ్రీ కృష్ణా కోఆపరేటివ్ సహకారం సంఘ అధ్యక్షుడిగా ఉన్న కూనసాని లక్ష్మోజీ ఆ పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తన హయాంలో సంఘం దాదాపు ఐదురెట్లు అభివృద్ధి సాధించేలా కృషి చేయడమే కాకుండా నిత్యం సంఘాన్ని లాభాల బాటలో నడపగలిగానన్నారు. దీనికి ఇంతకాలం తనకు సహకరించిన సంఘ సిబ్బందికి, తన సహచర సభ్యులకు, రైతులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో చిన్నారుల్లో శారీరక దృఢత్వం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): క్రీడలతో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని విజయవాడ రైల్వే ఏడీఆర్ఎం పి.ఈ.ఎడ్విన్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు శనివారం రైల్వే మినీ స్టేడియంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఆర్ఎం పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చిన్న వయస్సు నుంచే పోటీతత్వం, టీం వర్క్ అలవడుతుందన్నారు. క్యాంప్‌లకు తమ పిల్లలను పంపించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అనంతరం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందిన 68 మంది పిల్లలకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర్ బి.టి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆపద్కాలంలో తోటి వారికి సాయం అందించాలనే మానవతాన్ని ప్రతి ఒక్కరిలోనూ పెంపొందించాలనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిస్వార్థంగా కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. స్థానిక ఏలూరురోడ్డులోని మానవతా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా విశ్రాంత అధ్యాపకుడు గూడపాటి జయరామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పాబోలు గణేష్‌బాబు, కోశాధికారిగా గంటా ఇందిరాదేవి, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఉడత కృష్ణమోహన్, రేవిణిశెట్టి సూర్యనారాయణ, గోళ్ల మల్లికార్జునరావు, క్లోపల్లి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ముఖ్య అతిథిగా విచ్చేసిన మానవతా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పొట్లూరి శేషగిరిరావు, సీనియర్ సభ్యుడు తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరమని రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథి డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్‌ను ముందుగానేగుర్తిస్తే నివారించవచ్చున్నారు. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, లక్షణాలు, చికిత్స తదితరాలను వివరించారు. పౌష్టికాహారం ,ఆరోగ్యకరమైన జీవనశైలి బ్రెయిన్ ట్యూమ ర్ నివారణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించువాలని సూచించారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, ఏవోఐ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్, డాక్టర్ హసీనా బేగం పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983, 99122 20545 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com